# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 07-06-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

**1. నిరంతరం నేర్చుకుంటూ సమాజానికి అంకితభావంతో సేవలందించాల్సిన బాధ్యత వైద్యులపై ఉందని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు.**

**2. రంగారెడ్డి జిల్లా కోహెడలో అంతర్జాతీయ సమీకృత పండ్ల మార్కెట్‌కు తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు.**

**3. గోదావరి పుష్కరాలకు ఆతిథ్యమిచ్చే 268 గ్రామ పంచాయతీలను మోడల్ పంచాయతీలుగా అభివృద్ధి చేస్తామని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.**

**4. ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా వ్యర్థాల శుద్ధి, నిర్వహణ కోసం 300 కోట్ల రూపాయలతో ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వ అనుమతి లభించింది.**

==========================

నిరంతరం నేర్చుకుంటూ సమాజానికి అంకితభావంతో సేవలందించాల్సిన బాధ్యత వైద్యులపై ఉందని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. విశాఖపట్నం జిల్లా, సంగివలసలోని ఒక వైద్య కళాశాలలో నిన్న నిర్వహించిన స్నాతకోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. ప్రజలకు ఆరోగ్యకరమైన జీవనశైలి అలవాట్లపై వైద్యులు అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య ఆరోగ్య సేవల అంతరాలను తగ్గించడంలో డిజిటల్ హెల్త్ కార్యక్రమాలు, ఆధునిక వైద్య సాంకేతికతలు కీలక పాత్ర పోషిస్తాయని వెల్లడించారు.

--------------------------

హైదరాబాద్ నగరంలో పెరుగుతున్న జనాభా అవసరాలను దృష్టిలో ఉంచుకుని రంగారెడ్డి జిల్లా కోహెడలో అంతర్జాతీయ సమీకృత పండ్ల మార్కెట్‌ను 2 వేల 400 కోట్ల వ్యయంతో 240 ఎకరాల్లో నిర్మిస్తున్నట్లు తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలిపారు. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస రెడ్డితో కలిసి పండ్ల మార్కెట్‌తో పాటు సమీకృత సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల భవన సముదాయానికి ఆయన నిన్న శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..

వాయిస్...30 సెకన్లు

--------------------------

గోదావరి పుష్కరాలకు ఆతిథ్యమిచ్చే 268 గ్రామ పంచాయతీలను మోడల్ పంచాయతీలుగా అభివృద్ధి చేస్తామని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. పంచాయతీల నుంచి వచ్చే మురుగు నీరు గోదావరిలోకి చేరకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆయన ఆదేశించారు. గోదావరి మోడల్ పుష్కర్ పంచాయతీ ప్రణాళికపై జిల్లా కలెక్టర్లు, పంచాయతీ అధికారులతో ఆయన నిన్న మంగళగిరి నుంచి దృశ్య మధ్యమ సమావేశం నిర్వహించారు. పుష్కర ఘాట్లు, పుష్కర నగర్‌ల వద్ద పార్కింగ్, వీధి దీపాలు, వస్త్రాలు మార్చుకునే గదులు, స్నానమాచరించేందుకు సౌకర్యాలు, రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాలను ముందుగానే సిద్ధం చేయాలని సూచించారు.

---------------------------

రాష్ట్రవ్యాప్తంగా వ్యర్థాల శుద్ధి, నిర్వహణ కోసం 300 కోట్ల రూపాయలతో ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వ అనుమతి లభించిందని ఆంధ్రప్రదేశ్ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ పేర్కొన్నారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, దొంతాలి డంపింగ్ యార్డ్ లో నిర్మాణంలో ఉన్న వ్యర్థాల నిర్వహణ ప్లాంట్ పనులను అధికారులతో కలిసి ఆయన నిన్న పరిశీలించారు. అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ..

వాయిస్..25 సెకన్లు

---------------------------

పురుషుల అండర్-18 హాకీ కప్ 2026 టైటిల్‌ను భారత పురుషుల జట్టు కైవసం చేసుకోవడంపై కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. టోర్నమెంట్ మొత్తం జట్టు ప్రదర్శించిన అసాధారణ నైపుణ్యం, పట్టుదల ప్రశంసనీయమని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఆటగాళ్లు, కోచ్‌లు, సహాయక సిబ్బంది అంకితభావానికి ఈ విజయం నిదర్శనమన్నారు. భవిష్యత్తులోనూ జట్టు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు.

---------------------------

రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయం ప్రజా ఉద్యమంగా సాగుతోందని, సేంద్రీయ ఉత్పత్తులు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత పేర్కొన్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని ఒక సేంద్రీయ వ్యవసాయ క్షేత్రాన్ని ఆమె నిన్న సందర్శించారు. సేంద్రీయ వ్యవసాయం గురించి అక్కడి రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..

వాయిస్..30 సెకన్లు

---------------------------

యోగాంధ్ర నమోదు ప్రక్రియను ప్రభుత్వం నిన్న ప్రారంభించింది. యోగాంధ్ర పోర్టల్లో తొలిరోజు సుమారు 2 వేల మంది యోగా మాస్టర్ ట్రైనర్లు తమ పేర్లు నమోదు చేసుకోగా, వారికి జిల్లాల్లో శిక్షణ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయని అధికారులు తెలిపారు. శ్రీ సత్యసాయి జిల్లా లేపాక్షిలోని దేవాలయ ప్రాంగణంలో రాష్ట్ర స్థాయి యోగాసనాల కార్యక్రమాన్ని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఈ రోజు ప్రారంభిస్తారు. ఆరోగ్య సంరక్షణలో యోగా ప్రాధాన్యాన్ని తెలియజేసేలా విద్యార్థులకు వివిధ ఇతివృత్తాలపై పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్ తెలిపారు. ఈ పోటీలు ఈ నెల 20వ తేదీ వరకు నాలుగు దశల్లో, 14 రోజుల పాటు కొనసాగనున్నాయని పేర్కొన్నారు.

---------------------------

కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో విఫలమయ్యిందని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నాయకులు కురసాల కన్నబాబు ఆరోపించారు. అబద్ధాలు, అరాచకాలు, అవినీతి, బంధుప్రీతితో ప్రభుత్వం కాలం గడుపుతోందన్నారు. కాకినాడ జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో నిన్న నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజలను మోసం చేశారని పేర్కొన్నారు. అమరావతి రైతులు, డీఎస్సీ అభ్యర్థులు సహా పలు వర్గాలు ప్రభుత్వంపై అసంతృప్తితో ఉన్నారని అన్నారు.

---------------------------

రాష్ట్రంలో ఈ రోజు కొన్నిచోట్ల ఎండ తీవ్రత, మరి కొన్ని చోట్ల పిడుగులతో కూడిన వర్షాలు ప్రభావం చూపే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. 58 మండలాల్లో తీవ్రవడగాల్పులు, 104 మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మరోవైపు ఈ రోజు పలు జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతిలోని భాతర వాతావరణ సంస్థ వెల్లడించింది. నైరుతి రుతుపవనాలు రాయలసీమ జిల్లాల్లోని కొన్నిప్రాంతాలు తాకినట్లు, రానున్న 2 నుంచి 3 రోజులు మరింత విస్తరించడానికి వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నట్లు పేర్కొంది.

అదేవిధంగా తెలంగాణలో ఈ రోజు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు అక్కడక్కడా కురిసే అవకాశం ఉందని హైదరాబాదులోని వాతావరణ కేంద్రం వెల్లడించింది.

---------------------------

ప్రజా సమస్యల పరిష్కారం కోసం స్వీకరించిన వినతులను త్వరతగతిన పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ రహదారులు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్థన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. నంద్యాల జిల్లా బనగానపల్లెలోని తన క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వినతులను ఆయన నిన్న స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధితో కూడిన సుపరిపాలనను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ప్రాధాన్యతగా పేర్కొన్నారు.

=====================